క్లుప్తంగా

వైభవంగా వేణుగోపాలస్వామి గ్రామోత్సవం



మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో ఆదివారం రాత్రి మల్లేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి వార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయ కాపు కమిటీ ఆధ్వర్యంలో ఒకే వాహనంపై ఇరువురు స్వామి వార్ల అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు దర్శించుకుని టెంకాయలు కొట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



మంగళగిరి టౌన్ : కౌలు రైతులకు గుర్తింపు కార్డులతో పాటు పంట రుణాలు ఇవ్వాలని కోరుతూ కౌలు రైతు, రైతు సంఘాల మంగళగిరి రూరల్ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి తహసీల్దార్ దినేష్ చంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు ప్రకటించాలని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, పెసర పంటకు గిట్టుబాటు ధర 1 క్వింటాకు రూ.8 వేలు నిర్ణయించాలని పేర్కొన్నారు. మంగళగిరి మండల పరిధిలో అనేక గ్రామాల్లో వివిధ రకాల పంటలు పూతలకు వస్తున్నాయని, వాటిని గిట్టుబాటు ధరలు లేక తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. రైతు సంఘం జిల్లా నాయకుడు పాశం రామారావు, రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకుడు మాధవరెడ్డి, భీమిరెడ్డి కోటేశ్వరి, శివారెడ్డి, అప్పారావు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు నెలనెలా జీతాలు చెల్లించాలి



తాడేపల్లి రూరల్: రాజధానిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు నెలనెలా జీతాలు చెల్లించాలని సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు పల్లెకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడలో పారిశుద్ధ్య కార్మికులను కలసి, రాజధాని పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ జీతాల సమస్యపై సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెలా అధికారులు జీతాలు చెల్లించాలని కోరారు. విలీన గ్రామాల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ కార్మికులకు ఇచ్చే విధంగా రూ.21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, మహేష్, ఏబేద్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో అప్రమత్తంగా ఉండండి

మంగళగిరి టౌన్ : వీధి కుక్కల పట్ల ప్రజలు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా సోమవారం ఒక ప్రకటలో విజ్ఞప్తి చేశారు. ఎంటీఎంసీ పరిధిలో వీధికుక్కల సంచారం ఉంటే సమాచారం ఇవ్వాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు. ఇప్పటికే మండల పరిధిలోని కాజా వద్ద యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి సుమారు 2,500 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశామన్నారు. వాటికి ట్యాగ్‌లు వేసినట్లు పేర్కొన్నారు. వీధి కుక్కల బెడద ఉంటే..70939 12653, 0864 5295192 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

డొంకరోడ్ల అభివృద్ధికి కృషి



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని పొలాలకు వెళ్లే డొంకరోడ్ల అభివృద్ధి కృషిచేస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోనిరేపూడి గ్రామ శివారులోని పొలాలకు వెళ్లే డొంక రోడ్లు ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న పనులను సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పొలాలకు వెళ్లే రోడ్డుపై గుంతలు పూడ్చివేత, రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగింపు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధిహామి పథకం ద్వారా వేసవిలో కూలీలకు పనులు ప్రభుత్వం పనులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఏపీవో కిరణ్మయి, సర్పంచ్ చిట్టా అంజనీదేవి, చిట్టా అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలతలు పాల్గొన్నారు.

24 గంటలు అందుబాటులో విద్యుత్ సిబ్బంది

- ప్రాంతాల వారీగా ప్రత్యేక ఫోన్ నంబర్లు కేటాయింపు
- విద్యుత్‌శాఖ ఏడీఈ సురేష్‌బాబు



మంగళగిరి విద్యుత్ శాఖ కార్యాలయం

మంగళగిరి టౌన్ : ప్రస్తుత వేసవి కాలంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ప్రాంతాల వారీగా ప్రత్యేక ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచింది. అవి 24 గంటలూ పనిచేసేలా చర్యలు చేపట్టినట్లు మంగళగిరి విద్యుత్ శాఖ ఏడీఈ సురేష్‌బాబు సోమవారం పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలపై అర్ధరాత్రి ఫోన్ చేసినా వినియోగదారుని ఇంటి వద్దకు వెళ్లి సమస్య పరిష్కరించేందుకు సైతం సిబ్బందిని అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే ఫోన్ చేసిన వెంటనే విద్యుత్ సిబ్బంది సమస్యను పరిష్కరిస్తారని ఆయన తెలిపారు.

- **డీ (డిస్ట్రిబ్యూషన్)– 1 సెక్షన్:** ఈ సెక్షన్ పరిధి మంగళగిరి నగరంలోని గండాలయ్యపేట, పాత మంగళగిరి, సాయి నగర్, ఆంజనేయ కాలని, బాప్టిస్ట్ పేట, ఇందిరానగర్, భార్గవ్‌పేట, రత్నాల చెరువు ప్రాంతాలు వస్తాయి. ఇక్కడ విద్యుత్ సమస్యలు ఉంటే 94905 98735 నంబరును సంప్రదించాలి.
- **డీ – 2 సెక్షన్:** టిప్పర్ల బజార్, పార్కురోడ్డు, ఆటో నగర్, బ్యాంక్ కాలనీ, నిడమర్రు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తితే 77804 52836 ను సంప్రదించాలి.
- **డీ–2 సెక్షన్ రూరల్:** ఈ పరిధిలో ఉన్న ఎర్రబాలెం, నవులూరు, కృష్ణాయపాలెం ప్రాంతాల ప్రజలు 83329 99158 నంబరును సంప్రదించాలి
- **నూతక్కి ఏరియా:** నూతక్కి, ఆర్‌సీపురం, కొత్త పాలెం ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలకు 94906 15515ను తెలియజేయాలి.
- **మంగళగిరి రూరల్:** ఆత్మకూరు, ఇప్పటం రోడ్, శ్రీనగర్‌కాలనీ, శ్రీశైల నగర్, వడ్డెర పాలెం ప్రాంతాల ప్రజలు విద్యుత్ సమస్యల తలెత్తితే 94906 15514ను సంప్రదించాలి.
- **కుంచనపల్లి:** బ్రహ్మానందపురం, మదర్‌థెరిస్సా కాలనీ, రాధారంగా నగర్, తాడేపల్లి మున్సిపాలిటీ, కుంచనపల్లి ప్రాంతాల ప్రజలు 94910 44665ను సంప్రదించాలి.
- **కృష్ణానగర్ సెక్షన్:** నులకపేట, ప్రకాష్‌నగర్, నులకపేట ప్రాంతాల ప్రజలు 94906 15517 నెంబర్‌ను సంప్రదించాలని విద్యుత్ శాఖ ఎ.డి.ఇ. సురేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. కేటాయించిన ఫోన్ నెంబర్లలో 24 గంటలు ఆయా ప్రాంతాల లైన్‌మెన్, ఏఎల్‌ఎంలు అందుబాటులో ఉంటారని తెలియజేశారు.

మంగళగిరిని అభివృద్ధి చేస్తా

ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి నారా లోకేష్

మంగళగిరి: మంగళగిరిని దేశంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. నగర పరిధిలోని యర్రబాలెం డాన్ బాస్కో స్కూలు వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో పేదలకు ఇళ్ల పట్టాలను లోకేష్ పంపిణీ చేశారు. జూన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అటవీ భూములలో నివాసముంటున్న వారికి శాశ్వత ఇళ్ల పట్టాలు ఇస్తున్నామన్నారు. రెండవ విడతలో దేవాదాయ, రైల్వే భూములలో ఉన్న వారికి పట్టాలు అందజేయడం జరుగుతుందన్నారు. అటవీ, నీటిపారుదల శాఖ భూములలో ఇళ్లు వేసుకున్న వారికి సమయం పడుతుందన్నారు. ఈ నెల 13న 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 45 పార్కులు, 35 కమ్యూనిటీ హాళ్లు, ఆరు చెరువులు అభివృద్ధి చేయబోతున్నట్లు తెలిపారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఏపీఎండీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి

మంగళగిరి: రైతులు పండించే పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.భారతి డిమాండ్ చేశారు. నగర పరిధిలోని కాజలో సోమవారం రైతు సంఘం మండలాధ్యక్షుడు బాబు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భారతి మాట్లాడుతూ జొన్న, మొక్క జొన్న , పెసలు, అపరాలకు మద్దతు ధర లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు జొన్నా శివశంకరరావు, తమ్మా ప్రసాద్‌రెడ్డి, మాధవరెడ్డి, కోటేశ్వరి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల జీతాలను వెంటనే చెల్లించాలి

మంగళగిరి: పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు యర్రబాలెం, నవులూరు, నిడమర్రు, బేతపూడి సీఆర్డీఏ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాల్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు ఏజన్సీలకు అప్పగించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం రవి, ఎం.భాగ్యరాజ్, ఓ రామారావు, టి.ఆదిలక్ష్మి, ఏడుకొండలు, శివకోటి, మేరీ, నాగమణి, శివనాగేంద్రం, రజని, శిరీష పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్‌పై ఫిర్యాదు

మంగళగిరి టౌన్: బస్‌లో ప్రయాణిస్తుండగా మెడలో చైన్ అపహరణకు గురైందని మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఓ విద్యార్థిని ఫిర్యాదు చేసింది. సేకరించిన వివరాల ప్రకారం.. తాడేపల్లి బ్రహ్మానందపురానికి చెందిన విద్యార్థిని తెనాలిలో ఓ కళాశాలలో ఫార్మాడి కోర్సు చదువుతోంది. సోమవారం ఉదయం మంగళగిరి బస్టాండ్‌లో తెనాలికి వెళ్లే బస్సును ఆ విద్యార్థిని ఎక్కింది. ఆంజనేయ స్వామి గుడి బస్టాప్ వద్ద ఇద్దరు వ్యక్తులు మాస్క్ ధరించి బస్సు ఎక్కారని, వారు తనవైపే అనుమానంగా పలుమార్లు చూస్తున్నట్లు విద్యార్థిని ఫిర్యాదులో పేర్కొంది. బస్సు దుగ్గిరాల మండలం మోరంపూడి దాటిన తరువాత చున్నీ సరిచేసుకుంటూ మెడవైపు తడమగా మెడలో ఉన్న బంగారపు గొలుసు కనిపించలేదని పేర్కొంది. బస్టాప్‌లో మాస్క్ వేసుకున్న ఇద్దరు వ్యక్తులు హడావుడిగా దిగిపోయరని వారి మీద అనుమానం వ్యక్తం చేసింది. గొలుసు సుమారు 20 గ్రాములు ఉంటుందని తల్లిదండ్రులతో కలిసి ఫిర్యాదు చేసింది.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు



మంగళగిరి : నగర పరిధిలోని పెదవడ్లపూడికి చెందిన వృద్ధురాలు అదృశ్యం సోమవారం ఫిర్యాదు నమోదైంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. పెదవడ్లపూడికి చెందిన మునునూరి సుబ్బారావు భార్య స్వరూపారాణి(79) ఆదివారం ఉదయం 4.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అనంతరం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారిని విచారించినా సమాచారం లేకుపోవడంతో స్వరూపారాణి మనుమడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

తాడికొండలో భారీ వర్షం

- విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడికొండ: తాడికొండ మండలంలో సోమవారం సాయంత్రం అకాల వర్షం ముంచెత్తింది. కారు మబ్బులు కమ్ముకుని ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి ఈదుగాలులు తోడవడంతో విద్యుత్ సరఫరాలో ఆంతరాయం ఏర్పడింది. చెట్లు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు విద్యుత్ అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కల్లాల్లో ఆరబోసిన మిర్చిని కాపాడుకునేందుకు రైతులు పట్టాలు కప్పి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



తాడికొండలో కురుస్తున్న భారీ వర్షం

మాతాశిశు మరణాల నివారణపై అవగాహన

ఫిరంగిపురం: మాతాశిశు మరణాలపై అవగాహన అవసరమని ఆరోగ్యసిబ్బంది పేర్కొన్నారు. మండలకేంద్రంలోని సహకార వ్యవసాయ పరపతి సంఘం వద్ద సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతా శిశు మరణాలు సంభవించకుండా గర్భిణులు తీసుకోవాల్సి జాగ్రత్తలు గురించి వివరించారు. వేసవిలో వ్యవసాయం పనులకు వెళ్లే కూలీలు తలపై వస్త్రాన్ని ధరించి, ఎండ తగలకుండా చూసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని గాలి, వెలుతురు తగిలే ప్రదేశంలో ఉంచి తర్వాత వైద్యులను సంప్రదించాలని చెప్పారు. ప్రతి గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్ఎస్ షేక్, అబ్దుల్ రెహమాన్, బ్యాంకు సీఈవో భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యసిబ్బంది

రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్

తాడికొండ: మండల కేంద్రమైన తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో సోమవారం డీఎస్పీ మురళీకృష్ణ రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వివాదాలు, సెటిల్‌మెంట్లలో తలదూరిస్తే ఇబ్బందులు తప్పదని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలని, ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఉంటుందని హెచ్చరించారు. రౌడీషీటర్లు పోలీసులకు అందుబాటులో ఉండాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తుళ్లూరు సీఐలు శ్రీనివాసరావు, అంజయ్య, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

అప్పుల బాధతో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కాపాడిన స్థానికులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటం వద్ద అప్పుల బాధతో నీటి కుంటలోకి దూకి ఓ విద్యార్థి ఆత్మహత్యా యత్నం చేసిన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం వడ్డేశ్వరంలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి కాలేజీలో సీనియర్ల దగ్గర అప్పులు చేసి, ఆ అప్పులు కట్టలేక, ఒత్తిళ్లు తట్టుకోలేక మనస్తాపం చెంది ఆదివారం తాను ఉంటున్న ప్రైవేటు హాస్టల్ నుంచి బయటకు వచ్చి ఇప్పటం పరసర ప్రాంతంలో ఉన్న ఓ నీటిగుంటలోకి దూకాడు. గొర్రెల కాపరులు గమనించి ఆ విద్యార్థిని కాపాడారు. ఘటనపై యూనివర్సిటీ యాజమాన్యం విచారణ జరిపి, అప్పులు ఇచ్చిన కొంతమంది సీనియర్ విద్యార్థులను వారం రోజుల పాటు సస్పెండ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆత్మహత్యా యత్నం చేసిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి తన ఉంగరాలు, సెల్‌ఫోన్, ఇతర బంగారపు వస్తువులను విద్యార్థులకు తాకట్టు పెట్టినట్లు తెలియవచ్చింది.

పాపిరెడ్డికి అంతిమ వీడ్కోలు

గుంటూరు రూరల్: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, సోషలిస్ట్ పార్టీ నాయకుడు మోదుగుల పాపిరెడ్డి(88) అంతిమ యాత్ర సోమవారం నిర్వహించారు. సోమవారం నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్‌రోడ్డు రెడ్డిపాలెంలోని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి నివాసం నుంచి ఆయన అంతిమ యాత్ర నిర్వహించారు. తొలుత ఆయన పార్థివ దేహానికి నగరంలోని ప్రముఖులు, సాహితీవేత్తలు, పారిశ్రామిక వేత్తలు, పుర ప్రముఖులు, రాజకీయనాయకులు పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, కల్పలత, చంద్రగిరి ఏసురత్నం, ఆలపాటి రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నగర డెప్యూటీ మేయర్ డైమండ్‌బాబు, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నిమ్మకాయల రాజనారాయణ, డొక్కా మాణిక్యవరప్రసాద్, భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, అనూరాధ, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కొండవీడు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శివారెడ్డి, బొమ్మిడాల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పరీక్షల్లో ల్యాబ్ టెక్నీషియన్లు కచ్చితత్వం పాటించాలి

గుంటూరు మెడికల్: ల్యాబ్ టెక్నీషియన్లు చేసే పరీక్షల్లో కచ్చితత్వం పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం పట్టణ ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్ల నెలవారి సమావేశం నిర్వహించారు. డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ల్యాబ్ పరీక్షల వివరాలను ల్యాబ్ బయట ప్రదర్శించాలని తెలిపారు. పరీక్షల నివేదికలను సకాలంలో రోగులకు అందించాలని సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో భాగంగా పాటించాల్సిన పరిసరాల పరిశుభ్రత, సరియైన వివాహ వయస్సు(ఆడపిల్లలకు 21 సం, మగపిల్లలకు 25 ఏళ్లు) పాటించేలా చూడాలన్నారు. నవజాత శిశువుల సంరక్షణ, సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుట తదితర చర్యల వలన సంపూర్ణమైన ఆరోగ్యం సాధించవచ్చన్నారు. జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, ఉప మలేరియా అధికారులు రాజు నాయక్, ప్రభాకర్ రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి సూదాశివ గణేష్, శ్రీనివాసరావు, నరేంద్ర, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

తాడేపల్లి రూరల్: రైతు పండించిన జొన్న, మొక్కజొన్న, పెసర, అపరాల పంటలకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లిలో మండల కమిటీ సమావేశాన్ని మండల అధ్యక్షుడు మోదుగుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జొన్న శివశంకరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు రాక ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. పసుపు పంట క్వింటాకు రూ.15 వేలు, మిర్చి క్వింటాకు రూ.25 వేలు మద్దతు ధర ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 11వ తేదీ ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామాల్లో రైతు సంఘ పతాకావిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం నాయకులు వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, టి.బక్కిరెడ్డి, పి.వీరాస్వామి, గోపాల్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేసే ఓ మహిళ తనకన్నా చాలా చిన్నవయస్సులో ఉన్న ఓ వ్యక్తికి మానవతా దృక్పథంతో భోజనం పెడుతుండగా.. ఒక రోజు పెట్టలేదని మద్యం మత్తులో సదరు వ్యక్తి ఆ మహిళపై దాడిచేసిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకోంది. సోమవారం తెల్లవారుజామున సదరు వ్యక్తిని తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న గంజి ఏడుకొండలు అనే మహిళ సీతానగరంలో బోటుయార్డు వద్ద నివాసముంటోంది. అదే ప్రాంతంలో నివాసముంటున్న బత్తుల దుర్గారావు ఉంటున్నాడు. కరోనా సమయంలో అతని భార్య చనిపోవడంతో తను వండుకున్న భోజనం కొంత అతనికి సదరు మహిళ పెడుతోంది. ఆదివారం కార్మికురాలు గంజి ఏడుకొండలు ఒంట్లో బాగుండక పడుకుని నిద్రిస్తుండగా 11 గంటల సమయంలో భోజనం పెట్టమని అడగ్గా తనకు ఒంట్లో బాగోలేదని, వండలేదని చెప్పడంతో మద్యం మత్తులో ఉన్న బత్తుల దుర్గారావు ఆగ్రహించి పక్కనే ఉన్న రాడ్‌తో దాడిచేశాడు. కుంచాల దుర్గారావు తన పెద్దమ్మను కొట్టడం చూసి బత్తుల దుర్గారావును రాడ్‌తో దాడిచేయగా తీవ్ర గాయమైంది. బత్తుల దుర్గారావు కూడా ఒక ఇనుప రాడ్‌తో కుంచాల దుర్గారావును బలంగా పొడవడంతో పొత్తి కడుపులో దిగి తీవ్ర గాయం అయ్యింది. సంఘటనా స్థలానికి వెళ్లి పోలీసులు గాయపడిన దుర్గారావును విజయవాడ ప్రభుత్వం ఆసుపత్రిలో చేర్పించారు. ఇదిలా ఉండగా బత్తుల దుర్గారావు చేతిలో గాయపడిన గంజి ఏడుకొండలు మాకు కేసులు వద్దని చెబుతోంది.

ఆందోళన తీవ్రతరం చేస్తాం



సమ్మెలో పాల్గొన్న క్లాప్ ఆటో డ్రైవర్లు

మంగళగిరి టౌన్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యను పరిష్కరించుకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని సీఐటీయూ జిల్లా నాయకులు హెచ్చరించారు. క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాన్ని జిల్లా నాయకులు ప్రారంభించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజల నివాసాల నుంచి వచ్చే వ్యర్థాలను సమీకరించి డంపింగ్ యార్డులకు నిత్యం తరలించే ఆటో డ్రైవర్లు సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. స్వచ్ఛ మంగళగిరి ప్రాజెక్టులో వారి కృషి ఎనలేనిదని వారు పేర్కొన్నారు. ఇప్పటికే రెండు నెలల నుండి వేతనాలు చెల్లించడం లేదని, 16 నెలలుగా ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు అమలు చేయడం లేదని తెలిపారు. వీరిని ఆప్కాస్‌లో చేర్చి ప్రస్తుతం ఇస్తున్న వేతనం రూ.12,500 నుంచి రూ.24,500 వరకు పెంచాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు జవహర్‌లాల్, ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, ఎం.బాలాజి, క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శివ, రవి పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ మాట నిలబెట్టుకోవాలి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లి రూరల్ : విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఐఎఫ్‌టీయూ నాయకులు కె. ఆదినారాయణ డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు గత 125 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను తీరుస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శారద, లక్ష్మి, రమణ, మరియమ్మ, అంకమ్మ, వై.సుబ్బారావు, గురవయ్య, హగ్గయ్య, ఇమాంబి, దుర్గా భవాని, సాల్మన్ రాజు,వేముల లక్ష్మి, సామ్రాజ్యం, నాగమల్లేశ్వరి, సార్మ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రజకసంఘం నాయకులు

తాడేపల్లి రూరల్: ఈనెల 20, 21 తేదీల్లో కొండపల్లిలో జరుగనున్న ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లిలోని చిట్యాల ఐలమ్మ కల్యాణ మండపంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షల మంది రజక వృత్తిదారులు ఉన్నారని, నేటికీ గ్రామంలో రజకులపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని అన్నారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రజక కార్పొరేషన్ సంక్షేమ బోర్డు ద్వారా నిధులు విడుదల చేసి వృత్తిదారుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడాలని కోరుతున్నామన్నారు. ఆదరణ 2 కింద వృత్తిపరికరాలు అందజేయాలని, 50 ఏళ్లు దాటిన వృత్తిదారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, నాయకులు పి. శ్రీనివాసరావు, యానాది రావు, నరసింహారావు, బాబూరావు, ఎం .శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పన్నుపై ఐదు శాతం రాయితీ

నెహ్రూనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2 అర్ధ సంవత్సరాల మొత్తం ఆస్తి పన్ను ఏకమొత్తంగా ఏప్రిల్ నెలాఖారులోగా చెల్లించిన వారికి పన్ను మొత్తంపై 5 శాతం రాయితీ ప్రభుత్వం అవకాశం కల్పించిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి స్వయం ఉపాధికి 1153 మంది చేసుకున్న దరఖాస్తులను సోమవారం పరిశీలించినట్లు కమిషనర్ తెలిపారు. అమరావతి రోడ్‌లోని నవీన స్కూల్ క్యాంపునకు 552 మంది హాజరయ్యారని వెల్లడించారు.